ప్రజాశక్తి
శనివారం 26 అక్టోబర్ 2024



1న యువజనోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సెట్విజ్, ఎన్‌వైకె, ఎన్ఎస్ఎస్ సంయుక్తంగా జిల్లా స్థాయి యువజనోత్సవాలు (సాంస్కృతిక పోటీలు) నవంబర్ 1న విజయనగరం కోటలోని ఎంఆర్ స్కూల్ ఆఫ్ మేనేజెంట్ స్టడీస్‌లో నిర్వహిస్తున్నట్లు సెట్విజ్ సిఇఒ బి.రామగోపాల్ తెలిపారు. సైన్సు అండ్ టెక్నాలజి మేళా/ప్రదర్శన, జానపద నృత్యాలు, జానపద గీతాల పోటీలు గ్రూప్‌గా, వ్యక్తిగతంగా జరుగుతాయని తెలిపారు. కవిత్వం, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, డిక్లమేషన్ అండ్ ఫోటోగ్రఫీ పోటీలు వ్యక్తిగతంగా ఉంటాయన్నారు. హస్త కళలు, చేనేత వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తులు ప్రదర్శన, క్విట్ఇండియా స్టాల్, డ్రోన్ల ప్రదర్శన, 5జి టెక్నాలజీ ప్రదర్శన, కోవిడ్ వాక్సినేషన్ స్టాల్ , స్కిల్ డెవలప్మెంట్ స్టాల్ ప్రదర్శన, అమ్మకాలు ఉంటాయని తెలిపారు. పోటీలలో 15-29 సంవత్సరముల మధ్య వయసుగల యువతీ యువకులు పాల్గొనవచ్చని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రధమ స్థానం సాధించిన వారు జాతీయస్థాయి యువజనోత్సవాలలో పాల్గొంటారని పేర్కొన్నారు వివరాలకు ఫోన్. 8247554334 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఇసుక ఎంతైనా తెచ్చుకోవచ్చు

- మార్చి 31లోగా నిర్మించని ఇళ్లు రద్దు
- జెడ్‌పి సమావేశంలో మంత్రులు శ్రీనివాస్,సంధ్యారాణి
- ఉపాధి హామీ పనులన్నీ పంచాయతీల తీర్మానంతోనే చేపట్టాలి : జెడ్‌పి చైర్మన్
- జిల్లాలో ఇసుక కొరత లేదు : కలెక్టర్ అంబేద్కర్
- గుర్ల డయేరియా మృతులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తీర్మానం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సొంత అవసరాల కోసం ఇసుక ఎక్కడ నుంచైనా, ఎంతైనా ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ద్వారా తీసుకు వెళ్లే అవకాశాన్ని కల్పించినట్లు రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యా రాణి అన్నారు. ఎలాంటి కేసులు ఉండబోవని చెప్పారు. లారీల ద్వారా రవాణాచేసుకుంటే వ్యాపారం కోసం తీసుకెళుతున్నట్టుగానే ప్రభుత్వం గుర్తిస్తుందని అన్నారు. అనుమతి లేకుండా లారీలపై ఇసుక రవాణా చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం జెడ్‌పి సర్వ సభ్య సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ఫ్ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. పలు అంశాలపై వాడివేడిగా చర్చజరిగింది. హౌసింగ్‌పై చర్చ లో భాగంగా సభ్యులు మాట్లాడుతూ ఇసుక దొరకడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. మంత్రులు స్పందిస్తూ ఇసుక పై ఎలాంటి సీనరేజి, రుసుం లేదని, ఎక్కడ ఇసుక అందుబాటులో ఉంటే అక్కడి నుంచి తెచ్చుకోవచ్చని తెలిపారు. ఇసుక ఉచితమేనని, రవాణా ఖర్చులు లబ్దిదారులే భరించాలని మంత్రి స్పష్టం చేసారు. ప్రైవేటు భూముల్లో కూడా ఇసుకను తవ్వుకోవచ్చని, ఇందుకోసం ముందస్తుగా భూగర్భ గనులశాఖ నుంచి అనుమతిని పొందాల్సివుంటుందని పేర్కొన్నారు. నదులు, ఇసుక రీచ్‌లు లేని ప్రాంతాల వారు ఇసుకను పొందడం కష్టంగా ఉందని, వారికి ప్రత్యామ్నాయాన్ని చూపాలని ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించాలని జిల్లా పరిషత్ చైర్మన్ కోరారు. ఇసుక అంశం పై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ జిల్లాలో గత 4 నెలల్లో 92 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉండేదని, రోజుకు సుమారుగా వెయ్యి టన్నులను ఉచితంగా సరఫరా చేశారని, మెట్రిక్ టన్నుకు రూ.605 నిర్వహణా ఛార్జీలను మాత్రమే తీసుకున్నామని వివరించారు. ప్రస్తుతం 60 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని ప్రస్తుతం జిల్లా అవసరాలకు ఇసుక సరిపోయేటంత ఉందని తెలిపారు. వంతెనలు, రైల్వే ట్రాక్ ల వద్ద తవ్వితే నేరం అని, మిగిలిన ఎక్కడైనా గృహ అవసరాలకు ఇసుక ను తీసుకోవచ్చని వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గ్రామసభల తీర్మానంతోనే ఉపాధి పనులు

గ్రామసభల తీర్మానంతోనే గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు చేపట్టాలని మెజార్టీ సభ్యులు డిమాండ్ చేశారు. ఆగష్టు 23న నిర్వహించిన గ్రామ సభల్లో ఆమోదం పొందని పనులు కూడా తలపెడుతున్నారని, ఇది చట్ట విర్ధుమని జెడ్‌పి చైర్మన్ సహా సభ్యులు నిలదీశారు. చైర్మన్ మాట్లాడుతూ వెండర్ ద్వారా బిల్లులు చెల్లిస్తున్నారని, అలా కాకుండా గ్రామ పంచాయతీల ద్వారా చెల్లింపులు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే గ్రామ, మండల, జిల్లా పరిషత్‌లలో ఆమోదం పొందిన తర్వాతనే పనులు చేపట్టాలని తెలిపారు. కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్ స్పందిస్తూ ఉపాధి నిధులతో గ్రామ సభల్లో ఆమోదం పొందిన పనులను మాత్రమే చేస్తామని, పంచాయతీ తీర్మానం లేకుండా చేస్తున్న పనులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డయేరియా మృతులకు పరిహారమివ్వాలని తీర్మానం

గుర్లతోపాటు ఆ ప్రాంతంలో డయేరియాతో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని జెడ్‌పి సర్వ సభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. సభలో తొలుత ఎమ్మెల్సీ డాక్టర్ సురేష్ బాబు మాట్లాడుతూ గుర్ల లో డయేరియా తో 10 మంది మరణించడం విచారకరమని, డిప్యూటీ సిఎం స్పందిస్తూ ఒక్కొక్కరికీ లక్ష రూపాయల చొప్పున, జగన్ మోహన్ రెడ్డి రెండేసి లక్షల చొప్పున పరిహారం అందించారని, ప్రభుత్వం నుండి కూడా పరిహారం అందిస్తే బాధితులకు కొంత ఊరట లభిస్తుందని, ఈ విషయాన్నీ జిల్లా పరిషత్ ద్వారా తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని తెలిపారు. చైర్మన్ అంగీకారం తో తీర్మానం చేశారు. తాటిపూడి జలాశయానికి గురుపాటి బుచ్చి అప్పా రావు పేరును పెట్టాలని కోరుతూ సభ తీర్మానం చేసింది.

విఒఎల తొలగింపుపై రగడ

గ్రామైక్య సంఘాల విఒఎలను ,అధ్యక్షులను కనీసం ఎలాంటి నోటీసు జారీ చేయకుండా 75 మందిని మార్చేశారంటూ వైసిపికి చెందిన సభ్యులు అధికారులను నిలదీశారు. స్పందించిన మంత్రి శ్రీనివాస్ డిఆర్‌డిఎకు ఆయా విఒఎల నియామ కాలతో సంబంధం లేదని, మెజార్టీ సభ్యుల ఓటింగ్ తోనే విఒల ఎన్నిక జరుగుతుందని బదులిచ్చారు. పనితీరు బాగోలేకపోయినా, అక్రమాలకు పాల్పడినా మెజార్టీ ఓటింగ్‌తో విఒఎను తొలగించవచ్చని అన్నారు. అసలు సభ్యులకే తెలియకుండా విఒలను ఎలా తొలగిస్తారని జెడ్‌పి చైర్మన్‌తోపాటు పలువురు సభ్యులు మంత్రిని నిలదీశారు. ఈ సందర్భంగా ఇటు మంత్రులు, అటు చైర్మన్ సహా సభ్యుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది.

ప్రారంభం కాని 12వేల ఇళ్లు రద్దు

హౌసింగ్ శాఖ చర్చలో భాగంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో 12వేల గృహాలు ప్రారంభం కానివి ఉన్నాయని, వచ్చే మార్చి 31 లోగా ప్రారంభం కానివాటిని రద్దు చేస్తామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో లబ్దిదారులకు అవగాహన కల్పించాలని అన్నారు. కొత్తవలసలో మంజురైన స్థలాలను ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం కోసం మంజురైన వాటిని రద్దు చేసారని, వేరే చోట ఇచ్చినప్పటికీ నీటి సమస్య వలన నిర్మాణాలు చేపట్టలేకపోయారని స్థానిక జెడ్‌పిటిసి సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా, బోర్ వెల్స్‌ను వేయించాలని మంత్రులు హౌసింగ్ పీడీకి సూచించారు. గృహ నిర్మాణాలకు అందిస్తున్న రూ.1.8 లక్షలను రూ.2.5లక్షలకు పెంచాలని పలువురు జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు కోరారు.

సమావేశంలో ఎంపి కలిశెట్టి అప్పల నాయుడు, ఎమ్మెల్యేలు అదితి విజయలక్ష్మి గజపతి రాజు, తోయక జగదీశ్వరి, బోనెల విజయ్ చంద్ర, పార్వతీపురం జెసి శోభిక, జిల్లా పరిషత్ సిఇఒ సత్యనారాయణ, రెండు జిల్లాలకు చెందిన జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు



ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి, విద్యా దీవెన బకాయిల కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు కదంతొక్కారు. భారీ ర్యాలీగా వెళ్లి శుక్రవారం జెడ్‌పి కార్యాలయాన్ని ముట్టడించారు. మయూరి జంక్షన్ నుంచి జెడ్‌పి కార్యాలయం వరకు రహదారిపై విద్యార్థులు బైఠాయించి, ఆందోళన చేపట్టారు. దీంతో జెడ్‌పి సమావేశానికి హాజరైన మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మడి సంధ్యారాణి.. ఎస్ఎఫ్ఐ నాయకులతో చర్చలు జరిపారు. కేబినెట్‌లో చర్చిస్తామని, ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలతో మాట్లాడి ఫీజుల కోసం ఒత్తిడి చేయకుండా చర్యలు తీసుకుంటామని మంత్రులు హామీ ఇవ్వడంతో ఆందోళనన విరమించారు.

(పూర్తి కథనం మెయిన్‌లో)

ప్రజాదర్బార్‌కు పోటెత్తిన వినతులు

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే అదితి

ప్రజాశక్తి-విజయనగరంకోట

టిడిపి కార్యాలయం అశోక్‌బంగ్లాలో శుక్రవారం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి నిర్వహించిన ప్రజాదర్వార్‌కు వినతులు పోటెత్తాయి. నగరంలోని 31వ డివిజన్ నుంచి 50వ డివిజన్ వరకు ప్రజల నుంచి ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రజా దర్బార్ లో ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తామని తెలిపారు. పెన్షన్లు, ఒంటరి మహిళలకు రేషన్‌కార్డులకు, ఇళ్ల మంజూరు కోసం ఎక్కువగా వినతులు వచ్చాయి. పలు డివిజన్లలో సిసి రోడ్ల నిర్మాణాలు, వీధిలైట్లు వేయాలని వినతులు అందజేశారు. వీటన్నింటిని సచివాలయాలకు అందజేసి, ఆయా పరిధిలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజేష్ బాబు, నగర అధ్యక్షులు ప్రసాద్ లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, కర్రోతు నర్సింగరావు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, నాయకులు రొంగలి రామారావు, పైడ్రాజు, శ్రీనివాసరావు, గంటా పోలినాయుడు, వేచలపు శ్రీనివాసరావు, జనసేన నాయకులు రౌతు సతీష్ బిజెపి నాయకులు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

క్రీడాకారులకు ఎమ్మెల్యే అభినందన

ఇటీవల జరిగిన జూనియర్, సీనియర్ కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో కొండవెలగాడ గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు బెల్లాన భార్గవి, బెల్లాన హారిక వివిధ విభాగాల్లో రెండు రజిత పతకాలు కైవసం చేసుకున్నారు. ఆ క్రీడాకారులిద్దరూ శుక్రవారం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజును మర్యాదపూర్వకంగా కలిశారు, ఈ సందర్భంగా క్రీడాకారులను ఆమె అభినందించారు.

రూ.350 కోట్లతో ఉపాధి పనులు

- కేంద్ర నిబంధనల మేరకే వెండార్‌షిప్
- విలేకర్ల సమావేశంలో మంత్రి సంధ్యారాణి, శ్రీనివాస్

ప్రజాశక్తి - విజయనగరం కోట

జిల్లాలో రూ.350 కోట్లతో మెటీరియల్ కాంపొనెంట్ పనులు చేపడతామని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, రాష్ట్ర సెర్ఫ్, చిన్న మధ్యతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. తద్వారా గ్రామాల్లో రోడ్లు, కాలువలు, తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. జెడ్‌పి సమావేశం అనంతరం వారు విలేకర్లతో మాట్లాడారు. వెండార్‌షిప్ ద్వారా ఉపాధిహామీ పనుల్లో కాంట్రాక్టు వ్యవస్థ వస్తుందనే అపోహ సభ్యుల్లో వుందని, వెండార్‌షిప్ అనేది కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గత ప్రభుత్వ హయాంలోనే ప్రవేశపెడుతూ ఆదేశాలు జారీచేశారని చెప్పారు. వాటినే తాము అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. స్వయంశక్తి సంఘాలు ప్రతి మూడేళ్లకు విఒఎలను మార్చుకొనే అవకాశం డ్వాక్రా సంఘాలకు ఉందని ఆయా సంఘాలు తీర్మానం ద్వారా విఒఎలను మార్చుకోవచ్చన్నారు. సమావేశంలో ఎం.పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు అదితి విజయలక్ష్మి గజపతిరాజు, బోనెల విజయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన సైబర్‌క్రైమ్ సిఐ

ఇటీవల జిల్లాలో సైబర్ క్రైమ్ సీఐగా బాధ్యత తీసుకున్న ఎల్.అప్పల నాయుడు శుక్రవారం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఫోన్ కాల్స్ ద్వారా అనేకమంది నేరాలకు పాల్పడుతూ ప్రజల్ని ఆర్థికంగా ఇబ్బందులు పాల్జేస్తున్నారని, అటువంటి నేరాల పట్ల సామాన్య ప్రజలలో అవగాహన పెంచే కార్యక్రమాలను చేపట్టాలని మంత్రి సూచించారు.

ప్రభుత్వం కేటాయించిన భూముల తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న జెసి సేతు మాధవన్

- నవంబరు 3వ వారం నుంచీ ధాన్యం సేకరణ
- త్వరలో భూముల రీసర్వే
- జెసి ఎస్.సేతు మాధవన్

ప్రజాశక్తి-విజయనగరంకోట

వివిధ ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలకు ప్రభుత్వం కేటాయించిన భూములను తనిఖీ చేసి నివేదిక పంపించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ ఆదేశించారు. ఎలినేషన్ కమిటీ సమావేశం కలెక్టరేట్ లో శుక్రవారం నిర్వహించారు. గత 12 సంవత్సరాల్లో ప్రభుత్వ శాఖలు, సంస్థలు, ప్రయివేటు సంస్థలు, సంఘాలు, అసోసియేషన్లకు కేటాయించిన భూములపై సమీక్షించారు. ఏ అవసరానికి ఆయా భూములకు ప్రభుత్వం కేటాయించిందో, దానికి మాత్రమే ఆ భూములను వినియోగించాల్సి ఉంటుందని జెసి స్పష్టం చేశారు. కేటాయించిన భూమిని మూడేళ్లలో వినియోగంలోకి తేకపోతే, ఆ భూములను ప్రభుత్వం వెనక్కు తీసుకొనే అవకాశం ఉందన్నారు. మండలాల వారీగా ఆయా భూముల వివరాలపై ఆరా తీశారు. ఆ మండల తాహశీల్దార్, సంబంధిత శాఖ అధికారులు సంయుక్తంగా భూములను తనిఖీ చేసి, సమగ్ర నివేదికను అందజేయాలని జెసి ఆదేశించారు.

త్వరలో భూముల రీసర్వే ప్రారంభం

జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియను త్వరలో పునః ప్రారంభించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని జెసి తెలిపారు. మొత్తం 980 గ్రామాల్లో ఇప్పటికే సగం గ్రామాల్లో రీసర్వే పూర్తి అయ్యిందని, ఇంకా 448 గ్రామాల్లో రీసర్వే మొదలు పెట్టాల్సి ఉందని చెప్పారు. గతంలో జరిగిన రీసర్వేలో ఏమైనా పొరపాట్లు జరిగిఉంటే వాటిని సరిదిద్దాలని సూచించారు. గ్రామసభల్లో వచ్చిన ధరఖాస్తుల ఆధారంగా 15 రోజుల్లో తప్పులను సరిదిద్దాలని జెసి తెలిపారు.

నవంబరు మూడో వారం నుంచీ జిల్లాలో ధాన్యం సేకరణకు సిద్ధం కావాలని జెసి ఆదేశించారు. జిల్లాలో ఈ ఏడాది సుమారు 3,20,000 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. జిల్లాలోని 501 రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్‌లు, రైతుమిత్ర సంఘాల ద్వారా ధాన్యం సేకరణ జరుగుతుందని తెలిపారు. సుమారు 26 లక్షల గోనె సంచులు అవసరమని, ఒక్కో మిల్లుకు దాని సామర్థ్యం బట్టి 30వేల గోనె సంచులను సిద్ధం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. సమావేశంలో ఆర్‌డిఒలు డి.కీర్తి, బివి సత్యవాణి, విఎస్ఎస్ రామ్మోహన్, పశు సంవర్ధకశాఖ జెడి డాక్టర్ వైవి రమణ, సర్వేశాఖ ఎడి కె.రమణమూర్తి, సివిల్ సప్లయి డిఎం మీనాకుమారి, పర్యాటకాధికారి పిఎన్‌వి లక్ష్మీనారాయణ, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కర్రావు, ఎపిఐఐసి మేనేజర్ రామకష్ణ, పలువురు తాహశీల్దార్లు పాల్గొన్నారు

జెఎన్‌టియులో త్వరలో స్కిల్ సెంటర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జెయన్‌టియు-జివిలో త్వరలో స్కిల్ సెంటర్ ప్రారంభిస్తామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో జెఎన్‌టియు ఇన్చార్జ్ వైస్ ఛాన్సలర్ బి. రాజ్యలక్ష్మితో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎం ఎస్ ఎం ఈ కార్పొరేషన్ టెక్నాలజీ విభాగం ద్వారా స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయించాలని మంత్రిని అభ్యర్థించారు. విసి విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన మంత్రి అతి త్వరలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. విజయనగరం జిల్లాలోని విద్యార్థులు, నిరుద్యోగ యువత ఈ స్కిల్ సెంటర్ ఏర్పాటైతే శిక్షణ పొంది ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచుకునే వెసులుబాటు కలుగుతుంది.



మంత్రి శ్రీనివాస్‌తో చర్చిస్తున్న విసి రాజ్యలక్ష్మి

జెఎన్‌టియు, ఎంఎస్ఎంఇ మధ్య ఒప్పందం

జెఎన్‌టియు-జివి, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంటర్ప్రైజెస్) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. జెఎన్‌టియు-జివి ఇన్‌ఛార్జి వైస్‌ఛాన్సలర్ డి.రాజ్యలక్ష్మి, ఎంఎస్ఎంఇ టెక్నాలజీ నుంచి డిజిఎం జి.ప్రసాదరెడ్డి, సీనియర్ మేనేజర్ టి.విజయకృష్ణకాంత్, హెడ్ కె.మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొని ఒప్పందం చేసుకున్నారు. సిఎన్‌సి టెక్నాలజీస్, ఆటోమేషన్, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఇండస్ట్రీ-4.0, క్యారియర్ - ఆధారిత కోర్సుల ప్రత్యేక డొమైన్‌లో నైపుణ్యం కలిగిన మానవశక్తిని అభివృద్ధి చేయడం, పరిశ్రమ నిపుణుల కోసం స్వల్పకాలిక శిక్షణలు నిర్వహించడం.. దీని ప్రధాన లక్ష్యం.

సిఎం సహాయ నిధికి జెఎన్‌టియుజివి సిబ్బంది విరాళం

విజయవాడ వరద బాధితుల సహాయార్థం జెఎన్‌టియు అధ్యాపకులు, సిబ్బంది తమ ఒకరోజు వేతనం రూ.1,03,998 విరాళంగా అందజేశారు. చెక్కును కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ, డిప్యూటీ రిజిస్ట్రార్ కె.గంగరాజు అందించారు.

మొండి బకాయిల వసూలుకు చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆస్తిపన్ను మొండిబకాయిలను రాబట్టేందుకు నగరపాలక సంస్థ అధికారులు తీవ్ర కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు తన సిబ్బందితో కలిసి మొండి బయిదారుల దుకాణానికి వెళ్లి బకాయిలు రాబట్టేందుకు ప్రయత్నించారు. బకాయిలు చెల్లించే వరకు దుకాణానికి తాళం వేస్తామని చెప్పడంతో సదరు దుకాణదారుడు కొంత వ్యవధి కావాలని కోరడంతో వెసులుబాటు కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక కార్యచరణ రూపొందించి సిబ్బందితో ఆయా బకాయిదారుల వద్దకు వెళ్లి తక్షణమే బకాయిలు చెల్లించే విధంగా కృషి చేస్తున్నామన్నారు.

మంత్రిని కలిసిన విక్రమ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్‌ని శుక్రవారం విశాఖలో జనసేన నాయకులు అవనాపు విక్రమ్ మర్యాద పూర్వకంగా కలిశారు. విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సిఐఐ ఆంధ్రప్రదేశ్ టూరిజం, ట్రావెల్ సమ్మిట్‌కు విచ్చేసిన మంత్రిని విక్రమ్ కలిశారు. జిల్లాలో రామతీర్థం, రామనారాయణం, నీలావతి బౌద్ధారామాలు, పుణ్యగిరి, తాటిపూడి రిజర్వాయర్‌ను పర్యాటక ప్రాంతాలుగా గుర్తించాలని మంత్రిని ఆయన కోరారు. దీంతో జిల్లా పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని, తద్వారా ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

అవగాహన కల్పించేందుకే ఓపెన్ హౌస్

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు శాఖ అధ్వర్యంలో పోలీసు పరేడ్ గ్రౌండులో శుక్రవారం 'ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్‌పి వకుల్‌జిందాల్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్‌పితో పాటు అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఇతర పోలీసు అధికారులు ఓపెన్ హౌస్ ను సందర్శించి, విద్యార్థులతో మమేకమై పోలీసుశాఖ వినియోగించే వివిధ ఆయుధాలు, అత్యాధునిక పరికరాలు, సాంకేతికత పట్ల అవగాహన కల్పించి, వారిలో స్ఫూర్తి నింపారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఈ ఓపెన్ హౌస్'లో పోలీసుశాఖ కేసుల చేధనలో ఉపయోగించే సాంకేతికత, కమ్యూనికేషన్, బాంబ్ డిటెక్షన్, డిస్పోజల్, వివిధ ఆయుధాలు, డ్రోన్స్ వినియోగం, వేలి ముద్రల సేకరణ, బాడీవార్న్ కెమెరాలు, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్, ట్రాఫిక్ పోలీసులు వినియోగించే బ్రీత్ ఎనలైజర్లు, సిగ్నల్స్, స్పీడ్ గన్ మరియు ఇతర పరికాలు,నేర పరిశోధనలోను ,బాంబ్లను గుర్తించడంలో పోలీసు డాగ్స్ పని తీరు, బాంబ్ డిస్పోజల్ పరికరాలు గురించి విద్యార్థులకు, ప్రజలకు ఆసక్తి కలిగే రీతిలో వివరించామన్నారు. విద్యార్థుల్లో పోలీసుశాఖ పట్ల ఆసక్తి పెంచేందుకుగాను ఎన్నడూ లేని విధంగా సబ్ ఇన్‌స్పెక్టర్ పోలీసు యూనిఫామ్స్ కటౌట్స్ ఏర్పాటు చేసి, బాలురు, బాలికలు ఆ కటౌట్‌ల వద్ద నిలబడి, ఫోటోలు, తీసుకొనే విధంగా ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఆర్మ్‌డ్ రిజర్వు సిబ్బంది ఆయుధాల పనితీరును వివరించారు. బందోబస్తు విధుల్లో ఏదైనా సమాచారాన్ని, ఆదేశాలను పోలీసు అధికారులకు, సిబ్బందికి తెలిపేందుకు కమ్యూనికేషన్ వ్యవస్థ కీలకంగా పనిచేస్తుందని కమ్యూనికేషన్ ఆ సిబ్బంది తెలిపారు. క్లూస్‌టీం, బాంబు స్క్వాడ్, ట్రాఫిక్ ఎక్విప్‌మెంట్‌పై అవగాహనతోపాటు ఇటీవల చేపట్టిన సంకల్పం కార్యక్రమం గురించి వివరించారు. కార్యక్రమంలో డిఎస్‌పిలు ఎం.శ్రీనివాసరావు, యూనివర్స్, ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే. చౌదరి, మహిళా పిఎస్ సిఐ ఇ.నర్సింహమూర్తి, 1వ పట్టణ సిఐ ఎస్.శ్రీనివాస్, 2వ పట్టణ సిఐ టి.శ్రీనివాసరావు, ఆర్ఐలు, ఎఆర్, సివిల్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



తుపాకీ వినియోగంపై విద్యార్థినులకు వివరిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలలు, కళాశాలలు, పోలీసు పిల్లలు, పోలీసు ఉద్యోగులకు వేరు వేరుగా వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని పోలీసు అధికారులను ఎస్‌పి వకుల్ జిందాల్ ఆదేశించారు. 'రోల్ ఆఫ్ యూత్ ఇన్ ప్రివెన్షన్ ఆఫ్ సైబరు క్రైం' అనే అంశంపై పాఠశాల, కళాశాల విద్యార్థులకు, పోలీసు పిల్లలకు వేరు వేరుగా పోటీలు నిర్వహించాలని అధికారులను తెలిపారు. పోలీసు ఉద్యోగులకు 'చాలెంజ్ టూ పోలీసు ఇన్ ది ప్రెజెంట్ ఎన్విరాన్మెంట్' అనే అంశంపై వక్తృత్వ, వ్యాస రచన పోటీలను ఈనెల 26న జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నా మన్నారు. ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారిలో జిల్లా స్థాయిలో ఎంపిక చేసి, రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని ఎస్‌పి తెలిపారు. ఈ నెల 28న మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరాన్ని కూడా జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని, పోలీసు సిబ్బంది, పోలీసు కుటుంబాలు ఈ మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోలీసుల అమరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ వి.బాలాజీ రావు ఆధ్వర్యాన మున్సిపల్ హైస్కూలులో శుక్రవారం 'సైబర్ క్రైమ్ ను నిరోధించడంలో యువత పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మరోవైపు విశాఖపట్నం రైల్వేలైన్ సిఐ ఎ. రవికుమార్ శుక్రవారం ఉదయం విజయనగరం రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్లో రికార్డులను పరిశీలించారు.

బాధ్యతలు స్వీకరించిన డిఇఒ

విజయనగరంటౌన్ : డిఇఒగా నియమితులైన యు.మాణిక్యం నాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన కలెక్టర్ అంబేద్కర్ ను మర్యాద పూర్వకంగా కలుసుకొని పుష్ప గుచ్ఛం అందజేశారు. జిల్లాలో డిఇఒగా పనిచేసిన ఎన్. ప్రేమ్ కుమార్ విశాఖ జిల్లా విద్యా శాఖాధికారిగా బదిలీ అయ్యారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డిఇఒ మాణిక్యంనాయుడు



మద్యం దుకాణం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

వైన్‌షాప్ ఏర్పాటుపై నిరసన

ప్రజాశక్తి వంగర

మండలంలోని మద్దువలసలో జనావాసాల మధ్య పెట్టిన మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలని గ్రామస్తులు శుక్రవారం ఆ షాపు ఎదుట నిరసన చేపట్టారు. మద్యం షాపునకు సమీపంలో గురుకుల పాఠశాల, ప్రభుత్వ కళాశాల, దేవాలయం ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. అక్కడే తాగునీటి బోరు ఉందని , అందువల్ల మహిళలు కూడా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటుచేసిన మద్యం దుకాణాన్ని తరలించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా

గెడ్డపోరంబోకు భూములు ఆక్రమణ ● చోద్యం చూస్తున్న అధికారులు


మెంటాడ.. ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న నిర్మాణాలు

ప్రజాశక్తి- మెంటాడ

ప్రభుత్వ భూములు ఖాళీగా ఎక్కడ కనబడితే అక్కడ వాటిని ప్రజాప్రతినిధుల అండదండలతో ఆక్రమించి, నిర్మాణాలు చేపడుతున్నారు. చంపావతి నది పరివాహక ప్రాంతంలో స్థలాలు కబ్జా చేసి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలో ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సంకల్పించి మెంటాడ, తమ్మిరాజుపేట గ్రామాల్లో రైతుల నుంచి భూములను కొనుగోలు చేసింది. వాటిలో పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. ఆర్థిక పరిస్థితుల కారణంగా ఇళ్లను కొంతమంది నిర్మించుకోలేక స్థలాలను అలాగే వదిలేశారు. ఇదే అదునుగా కొందరు వాటిని ఆక్రమించుకొని ఇళ్లు నిర్మించుకున్నారు. తమ స్థలాలు ఇవ్వాలని కోరుతుంటే, ప్రజాప్రతినిధుల నుంచి బెదిరింపులు వస్తున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామకంఠంలో స్థలాలను ఆక్రమించుకొని మండల కేంద్రంలో ఇళ్లు నిర్మిస్తూ వస్తున్నారు. చాలా గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఇదంతా తెలిసినప్పటికీ అధికారులు కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చెరువు ఆక్రమణకు యత్నం

బొబ్బిలి : మున్సిపాలిటీలోని మిలటరీ కాలనీ పక్కనున్న చెరువును రియల్ ఎస్టేట్ వ్యాపారి కబ్జాకు ప్రయత్నిస్తున్నారు. చెరువులో ట్రాక్టర్లతో మట్టి వేసి కప్పి వేస్తున్నారు. పట్టపగలు చెరువును కప్పేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. చెరువు కబ్జాను అడ్డుకుని, ఆక్రమణదారుపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా నాయకులు కోట అప్పన్న డిమాండ్ చేశారు.


బొబ్బిలి.. చెరువును కప్పేసేందుకు ట్రాక్టర్‌తో వేస్తున్న మట్టి

సిబిఎం స్థలం రిజిస్ట్రేషన్ రద్దుచేయాలి

వామపక్షాలు, ప్రజా సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-బొబ్బిలి

పటణంలోని సిబిఎం పాఠశాల స్థలం రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని గంటి ప్రసాదం స్మారక భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సిబిఎం పాఠశాలకు దొంగ డాక్యుమెంట్లు సృష్టించి తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన కరస్పాండెంట్ రత్న కుమార్‌ను అరెస్ట్ చేసి జైల్లో పెట్టాలని డిమాండ్‌చేశారు. సిబిఎం స్కూల్ భూ బదలాయింపు రిజిస్ట్రేషన్‌ను తక్షణమే రద్దు చేసి, పాఠశాలకు పూర్వవైభవం తేవాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం, సిపిఐ పట్టణ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న, ఎఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు వి.శ్రావణ్ పాల్గొన్నారు.

పనికి వెళ్లకుండానే మస్తర్లు

గ్రామసభలో బయటపడిన అవినీతి ● సోషల్ ఆడిట్ ప్రజావేదికపైనే అందరి చూపు

ప్రజాశక్తి - జామి

పనికి వెళ్లకుండానే ఉపాధి పనుల మస్తర్లు వేశారంటూ, సోషల్ అడిట్ తనిఖీల్లో భాగంగా చేపట్టిన గ్రామసభలో తీవ్ర అభియోగాలు బయట పడటంపై ప్రకంపనలు రేగుతున్నాయి. జామి మండల కేంద్రంలో ఏటా లక్షల పని దినాలు నమోదైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఉపాధి పనుల్లో భారీ అవినీతి జరుగుతుందన్న ఆరోపణలు లేకపోలేదు. ఇటీవల జామి మేజరు పంచాయతీ కార్యాలయంలో సోషల్ అడిట్ బృందం నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారడమే అందుకు నిదర్శనం. సర్పంచ్ చిప్పాడ లక్ష్మి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో సోషల్ అడిట్ డిఆర్‌పిలతోపాటు ఎపిఒ కూడా వేదికపై ఉన్నారు. అయితే అనూహ్యంగా కొంతమంది గ్రామస్తులు ఉపాధి హామీ పనుల్లో భారీ అవినీతి జరిగిందని ఆందోళనకు దిగారు. లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు కూడా చేశారు. సభలో ఉన్న ఓ కీలక నాయకులు అభియోగాలను ఆడిట్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లకుండా అడ్డుతగిలే ప్రయత్నం చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా గ్రామంలో కొంతమంది ఉపాది పనులకు వెళ్లకుండా మస్తర్లు వేసుకుని భారీగా ప్రభుత్వ ధనాన్ని లూటీ చేశారన్నది వారి అభియోగం. గ్రామంలోని వాలంటీర్లు పేరుతో కూడా నిబంధనలకు విరుద్ధంగా మస్తర్లు వేశారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటన్నింటి వెనుక మేజరు పంచాయతీలో కీలక మహిళా నేత సూత్రధారి.. అంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆమె ప్రతిపక్ష పార్టీ అయినా, టిడిపిలో ఒక గ్రూపుతో చేతులు కలిపి, విచ్చలవిడిగా అవినీతికి పాల్పడ్డారని తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ నెల 30న జరిగే సోషల్ ఆడిట్ ప్రజావేదికలో ఏ మేరకు ఉపాధి అవినీతి బయపడుతుందో చూడాలి. ఒక్క జామి మేజరు పంచాయతీనే కాదు.., మండల వ్యాప్తంగా ఉపాధి పనుల్లో భారీఎత్తున అవినీతి చోటుచేసుకుందన్న చర్చ సాగుతోంది.

సోషల్ ఆడిట్ నివేదిక వస్తేనే..

గ్రామసభల్లో ఆరోపణలు వచ్చినప్పటికీ, వాటిని సోషల్ ఆడిట్ బృందాలే తనిఖీ చేసి, నిజానిజాలు తెలియజేయాల్సి ఉంది. అప్పుడే ఏ విధమైన చర్యలు తీసుకోవాలో పరిశీలిస్తాం. అప్పటి వరకు వాటిపై ఏమీ మాట్లాడలేను.

- కిరణ్మయి, ఎపిఒ, జామి

కలెక్టర్, జెడ్‌పి చైర్మన్ దృష్టికి ప్రధాన సమస్యలు

ప్రజాశక్తి-భోగాపురం

మండలంలో రెండు ప్రధాన సమస్యలను ఎంపిపి ఉప్పాడ అనూషరెడ్డి.. కలెక్టర్ అంబేద్కర్, జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి శుక్రవారం తీసుకెళ్లారు. భోగాపురం సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాలకు స్టాంప్ డ్యూటీపై సర్‌ఛార్జీలను మార్చి 2022 నుంచి జమ కాలేదు. 3:1:1 నిష్పత్తిలో భోగాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో అన్ని గ్రామ పంచాయతీలకు నిధులను కేటాయించి, విడుదల చేయాలని కోరుతూ వారికి వినతులు అందించారు. విద్యుత్ శాఖకు సంబంధించి తీర ప్రాంత గ్రామాల్లో ఉప్పు గాలికి కేబుళ్లు, కండక్టర్లు పాడైపోయాయని, కొత్తవి ఏర్పాటుచేయాలని, మిగతా చోట్ల దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టాలని, ఖాళీగా ఉన్న జెఎల్‌ఎం పోస్టులను భర్తీచేయాలని విన్నవించారు. ఆమె వెంట సలహాదారు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి ఉన్నారు.


జెడ్‌పి చైర్మన్‌కి వినతి అందిస్తున్న ఎంపిపి అనూష

అగ్నిపథ్‌కు ఎంపికైన విద్యార్థికి సత్కారం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎస్‌సి చదువుతున్న కె.గణేష్ అగ్నిపథ్‌కు ఎంపికయ్యాడు. దీంతో కళాశాలలో శుక్రవారం గణేష్‌ను ప్రిన్సిపల్ సిహెచ్ కేశవరావు ఆధ్వర్యాన సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె.వాసుదేవరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఉద్యోగులు శుక్రవారం భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. బిఎస్ఎన్ఎల్ ఉద్యోగ సంఘాల సమన్వయ కమిటీ పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. వేతన సవరణ, పెన్షన్ సవరణను నిరాకరించడం ద్వారా ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులకు, పింఛనర్లకు అన్యాయం చేస్తోందని నాయకులు ఎ.వెంకటరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. బిఎస్ఎన్ఎల్ నష్టాలతో నడుస్తోందనే సాకుతో ఆ సవరణ సమస్యలను పరిష్కరించలేమని చెబుతున్న ప్రభుత్వ వాదన సరికాదన్నారు. బిఎస్ఎన్ఎల్ ఆర్థిక సంక్షోభానికి ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. వోడాఫోన్ ఐడియా నెట్‌వర్క్‌ని ఉపయోగించడం ద్వారా బిఎస్ఎన్ఎల్‌ని తక్షణమే 4జి సేవలను ప్రారంభించడానికి అనుమతించాలని డిమాండ్ చేశారు. బిఎస్ఎన్ఎల్‌లో రెండో విఆర్ఎస్ అమలు చేయవద్దని కోరారు. కార్యక్రమంలో క్రిష్ణకుమారి, రమణమ్మ, లక్ష్మణకుమార్, శకుంతల, ఉద్యోగులు పాల్గొన్నారు.

5 మండలాల్లో ఆయిల్‌పాం సాగు విస్తరణ

ప్రజాశక్తి - జామి

పంటల మార్పిడి ద్వారా డివిజన్‌లో ఉన్న ఐదు మండలాల్లో ఆయిల్‌పాం సాగు విస్తీర్ణం పెంచుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఎడి భారతి సూచించారు. శుక్రవారం జామి రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఐదు మండలాల వ్యవసాయ సిబ్బంది, సహాయకుల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఉపాధి హామీలో జాబ్ కార్డు ఉన్న ప్రతి రైతు కూడా ఆయిల్‌పాం వేసుకుంటే మొక్కపై రాయితీగా రూ.20 వేలు, నిర్వహణ కోసం రూ.5250 ఏడాదికి హెక్టారుకు ప్రభుత్వం రాయితీగా అందిస్తుందన్నారు. ఆయిల్‌పాం మద్దతుధర రూ.17 వేలు ఉందన్నారు. పంట వేసిన నాలుగో ఏడాది నుంచి దిగుబడి వస్తుందన్నారు. ఎకరాకు ఏడాదికి సరాసరి 12 మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వస్తుందని, అది లాభదాయకమని సూచించారు. బోర్‌తో సాగు చేసే ప్రతి రైతు కూడా ఆయిల్‌పాం సాగు చేస్తే చాలా లాభ దాయకంగా ఉంటుందన్నారు. రబీ సీజన్ నుంచి పంటల బీమా ప్రీమియం రైతులు చెల్లించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎడి ఎల్.విజయ, ఎఒ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోట ప్రాంతంలో బాలికల కోసం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు పల్ల సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం గిరిజన బాలికల కళాశాల వసతిగృహం వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల లేకపోవడంతో విద్యకు దూరమవు తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం నాయకులు శివ, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

పాలకు గిట్టుబాటు ధర ఇవ్వాలి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు

ప్రజాశక్తి-కొత్తవలస

విశాఖ డెయిరీ తగ్గించిన పాల ధర వెంటనే పునరుద్ధంచాలని, గిట్టుబాటు ధర ఇవ్వాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తవలస మండలంలో బలిఘట్టం, పాత సుంకరపాలెం, కొత్తూరు, కంటకాపల్లి, కాటకాపల్లి గ్రామాల్లో పర్యటించి పాడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార రంగంలో ఉండాల్సిన డెయిరీలను రాష్ట్రంలో కంపెనీ యాక్టు పరిధిలోకి తేవడం వల్ల పాడిరైతులకు అన్యాయం జరిగిందని తెలిపారు. సహకార రంగంలో ఉంటేనే పాడి రైతులకు న్యాయం లభిస్తుందన్నారు. గత పదేళ్లలో పాడి రైతులకు ఇవ్వాల్సిన బోనస్, ఇతర ప్రయోజనాలు అందకుండా పోయాయని చెప్పారు. లీటరు పాలకు రూ.10 బోనస్ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. బ్యాంకుల ద్వారా పాడి రైతులకు పశువుల రుణాలు ఇవ్వాలని, విశాఖ డెయిరీలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. దీనిపై ఈ నెల 29న విశాఖ డెయిరీ వద్ద చేపట్టే ఆందోళనకు పాడి రైతులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పాల రైతు సంఘం జిల్లా కార్యదర్శి గొంప కృష్ణమూర్తి, నాయకులు టి.పైడంనాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

పాకివీధి పక్కనున్న ఖాళీ స్థలంలో మున్సిపల్ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకరరావు అధికారులను డిమాండ్ చేశారు. స్థానిక పాకివీధిలో శుక్రవారం మున్సిపల్ శాఖా మహాసభ నిర్వహించారు. ముందుగా సిపిఎం జెండాను ఎగుర వేసి అమరవీరులకు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాకివీధి పక్కనున్న ఖాళీ స్థలంలో ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీనిచ్చి, ఇప్పుడు మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పడం అన్యాయమన్నారు. ప్రభుత్వం స్పందించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం నాయకులు ఎస్.గోపాలం, యుగంధర్, వాసు, సభ్యులు పాల్గొన్నారు.

మానవ సేవే పరమావధి

ప్రజాశక్తి-రామభద్రపురం

మానవాళికి సేవే పరమావధి కావాలని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు అన్నారు. శుక్రవారం నాయుడువలసలో ఎస్‌సి వీధిలో కారుణ్య ఫౌండేషన్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దోమతెరలను ఆయన పంపిణీ చేశారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు, రోటరీక్లబ్ ప్రతినిధులను ఆయన అభినందించారు. అనంతరం సంకల్పం కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ వల్ల నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి రోటరీ క్లబ్ చైర్మన్ సింద్రి శ్రీనివాసరావు, వారణాశి శ్రీహరి, నాయుడువలస ఉప సర్పంచ్ లెంక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాగునీటి పంపిణీ పట్ల జాగ్రత్త

కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తాగునీటి పంపిణీ పట్ల బాధ్యతయుతంగా వ్యవహరించాలని, నీరు కలుషితం కాకుండా జాగ్రత్త వహించాలని ఎమినిటీస్ కార్యదర్శులకు కమిషనర్ పి. నల్లనయ్య ఆదేశించారు. శుక్రవారం కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీరు వృథా కాకుండా చూడాలన్నారు. పైపులైన్ లీకేజీలు ఉన్నట్లయితే వాటిని యుద్ధ ప్రాతిపదికన సరి చేయాలని చెప్పారు. అనుక్షణం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ తాగునీటి పంపిణీ పట్ల ఇబ్బందులను ఎప్పటికప్పుడు సరి చేసుకోవాలన్నారు. నీటి పంపిణీ ఉదయం 9 లోపే జరగాలన్నారు. సమావేశంలో ఇఇ టి.రాయల్ బాబు, డిఇలు శ్రీనివాసరావు, మణికుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

పలుప్రాంతాల్లో కమిషనర్ పర్యటన

నగరంలోని వివిధ ప్రాంతాలలో కమిషనర్ నల్లనయ్య పర్యటించి తాగునీటి పంపిణీ విధానం, పారిశుధ్య పనులు పరిశీలించారు. అంబేద్కర్ కాలనీ, అలకానంద కాలనీ, పోలయ్యపేట, బొగ్గుల దిబ్బ, ఆర్ అండ్ బి తదితర ప్రాంతాలలో పర్యటించారు. కంటోన్మెంట్ ప్రాంతంలో ఉన్న రెండు వాటర్ ట్యాంక్ ల వద్దకు చేరుకుని ఆయా ట్యాంకుల ద్వారా జరుగుతున్న నీటి పంపిణీని పరిశీలించారు. క్లోరినేషన్ పరీక్షలను దగ్గరుండి చేయించారు. అనధికార నిర్మాణం పట్ల ఉదాసీనంగా వ్యవహరించిన ప్రణాళిక కార్యదర్శి పై మెమో జారీ చేశారు. బొగ్గుల దిబ్బ ప్రాంతంలో మరమ్మతులకు గురైన రహదారి ఇరువైపులా చెట్లు నాటి, సిసి రహదారి ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఆర్‌అండ్‌బి జంక్షన్ వద్ద అనధికార నర్సరీని గుర్తించి తక్షణమే తొలగించి వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర అభివద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు.


కాలువలో ఉన్న పైపులైన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

డ్రగ్స్ వినియోగంతో భవిష్యత్తు నాశనం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

డ్రగ్స్ వినియోగిస్తే యువత భవిష్యత్తు నాశనమవుతుందని సిఐ రామకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక మిమ్స్ వైద్య కళాశాలలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసకావద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో షాపు వేలం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్దనున్న దుకాణానికి నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు ఛాంబర్‌లో శుక్రవారం వేలం పాట నిర్వహించగా నలుగురు ఆసక్తిదారులు పాల్గొన్నారు. వీరిలో ఒకరు దుకాణాన్ని దక్కించుకున్నారు. . వాస్తవానికి రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ కు ఆనుకుని 22 దుకాణాలు ఉండగా వాటిలో 19 దుకాణాలను ఇదివరకే వేలంపాటలో కొంతమంది దక్కించుకున్నారు. మిగిలిన మూడింటిలో ఎస్టీ మహిళకు ఒకటి, వికలాంగులకు ఒకటి, నాయీ బ్రాహ్మణులకు ఒకటి రిజర్వేషన్ ప్రాతిపదికన కేటాయించారు. పాత, కొత్త ఐడిఎస్ ఎంటి షాపింగ్ కాంప్లెక్స్ పై ఎంతస్తులను శనివారం వేలం పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పశుగణనకు సహకరించాలి

ఎమ్మెల్యే లలితకుమారి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పశుసంవర్ధక శాఖ చేపట్టే పశుగణనకు రైతులు, పెంపకందారులు సహకరించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. శుక్రవారం 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం వాల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం విషయ సేకరణదారులకు ఆమె కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బి.వి.పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బాడంగి : దొంకినవలస సచివాలయ పరిధిలోని ఎరుకుల పాకలు గ్రామంలో పశుగణన వాల్‌పోస్టర్‌ను ఎంపిటిసి పాలవలస గౌరు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయకులు సంతోష్ పాల్గొన్నారు.

రామభద్రపురం : మండలంలో పశుగణన ప్రారంభించినట్లు మండల పశువైద్యాధికారి హిరణ్య తెలిపారు. పశుగణన వాల్‌పోస్టర్‌ను సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, ఉప సర్పంచ్ చింతల రామకృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశు వైద్యులు సురేష్,స్రవంతి సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్ : మండలంలోని నారసింహునిపేట గ్రామంలో శుక్రవారం పశుగణన చేపట్టారు. సర్పంచ్ రెడ్డి హిమబిందు మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి జి.ఉమాదేవి, పశుసంవర్ధక సహాయకులు ఎం.భారతి, మాజీ ఎంపిటిసి రెడ్డి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



శృంగవరపుకోట.. పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి, అధికారులు

కాలు జారిపడి అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతి

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఫ్లోరెన్సిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎస్‌పి వెంకట పవన్‌కుమార్ బాత్‌రూమ్‌లో కాలుజారిపడి గాయపడి మృతి చెందారు. గురువారం ఊటగెడ్డ సమీపంలోని తన ఇంట్లో ఈ సంఘటన చోటు చేసుకుంది. తలకు బలమైన గాయం కావడంతో మిమ్స్ ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. పరిస్థితి విషమించి మృతి చెందారు. తల్లి కృష్ణవేణమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు.



మొక్కలను పంపిణీ చేస్తున్న సబల ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రావణి

మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

సబల ప్రాజెక్టు ద్వారా కెజెపూడి పంచాయతీ పరిధిలోని గ్రామాల రైతులకు 13 రకాల మొక్కలను శుక్రవారం పంపిణీ చేశారు. అంగన్వాడీలు, పాఠశాలలకు 18 రకాల ఆకుకూరలు, కూరగాయల మొక్కలను అందించారు. కార్యక్రమంలో సబల ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రావణి, సిఎస్ఎ వెంకటరావు, జనార్దన్, ఎంటి ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

గోస్తనీ నదిలో చెత్త తొలగింపు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - జామి


గోస్తనీ నదిలో చెత్తను తొలగిస్తున్న పొక్లెయినర్

గోస్తనీ నదిలో జామి మేజర్ పంచాయతీ వ్యర్థాలను డంపింగ్ చేస్తున్నారన్న విషయంపై 'ప్రజాశక్తి'లో 'గర్భ గుణపాఠం చాలదా?' శీర్షికతో శుక్రవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ఎంపిడిఒ నీలం అప్పలనాయుడు ఆదేశాల మేరకు నదీ గర్భంలో ఇప్పటివరకు నిల్వ చేసిన చెత్త, చెదారాన్ని పొక్లెయినర్, ట్రాక్టర్ల సహాయంతో తరలించారు. మరోవైపు జామి మేజర్ పంచాయతీ డంపింగ్ యార్డు శాశ్వత పరిష్కారం కోసం ఆలోచన చేయాలని ప్రజలు కోరుతున్నారు. డంపింగ్ యార్డుకు అవసరమైన స్థలాన్ని గుర్తించేందుకు తహశీల్దార్‌కు లేఖ రాయనున్నట్లు జామి ఇఒ ఎస్.రమణారావు 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఉమ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పార్వతి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వరలక్ష్మికి గ్లోబల్ ఉమెన్ పురస్కారం

ప్రజాశక్తి-శృంగవరపుకోట



పురస్కారం అందుకుంటున్న వరలక్ష్మి

వివిధ విభాగాలలో అత్యున్నత సేవలు అందిస్తున్న వరలక్ష్మి పబ్లిక్ స్కూల్, కొంపర్తి హాస్పిటల్ అధినేత డాక్టర్ వరలక్ష్మికి అరుదైన పురస్కారం లభించింది. ఇటీవల ఢిల్లీలో గ్లోబల్ ఉమెన్ ఇన్స్‌పిరేషన్ పురస్కారాన్ని ఆమె అందుకున్నారు. వ్యసనాల బారిన పడిన ఎంతోమందికి ఉచితంగా మందులు, కౌన్సెలింగ్ ఇచ్చి, వారిని వాటి నుంచి దూరం చేయడం, ఆయా కుటుంబాలకు సహకారం అందించడం, పేద విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు కల్పించడం, తదితర సేవలు చేసినందుకు ఆమెకు ఈ పురస్కారం లభించింది.

జాబ్‌మేళాలో 96మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 96 మంది ఉద్యోగాలు సాధించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. జాబ్ మేళాకు 303 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను ప్రిన్సిపల్ బివి రమణరావు, కంపెనీ యాజమాన్య ప్రతినిధులు అందజేశారు. జస్ట్ డయల్, యంగ్ ఇండియా, టాటా అడ్వాన్స్, పేటిఎం కంపెనీలలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఉంటుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్ కుమార్, ప్లేస్ మెంట్ కోఆర్డినేటర్ టి.భాస్కర్ చెప్పారు. కార్యక్రమంలో ఐటిఐ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయాల సందర్శన

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని పాల్తేరు, బొత్సవానివలస సచివాలయాలను శుక్రవారం ఎంపిడిఒ రామకృష్ణ సందర్శించారు. తాగునీటి పరీక్షలు, క్లోరినేషన్, పారిశుధ్య, మూవ్మెంట్ రికార్డులు, ఎస్‌డబ్ల్యుపిసి సంబంధించి నిర్వహణపై సూచనలు చేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సూర్యనారాయణ, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

4 నుంచి డైట్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ సంస్థ (డైట్)లో వచ్చే నెల 4 నుంచి 19 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎస్.తిరుపతినాయుడు తెలిపారు. 2018 డిఇడి బ్యాచ్ సప్లిమెంటరీ, 2023-25 బ్యాచ్‌కి రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హాల్‌టిక్కెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ముగ్గురు ఎంపిక

ప్రజాశక్తి-కొత్తవలస

భోగాపురంలో జరగనున్న రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు దెందేరు హైస్కూల్ విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. పోటీలకు ఎంపికైన గొర్లె రేవతి, యామిని, ఎం.యోగేశ్వరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సునీత, స్టాఫ్ సెక్రటరీ కె.శ్రీనివాసరావు, పీడీ కె.కృష్ణంరాజు అభినందించారు.

ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి-వంగర

ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు సిద్ధంగా ఉండాలని తహశీల్దార్ డి.ధర్మరాజు అన్నారు. వంగరలో శుక్రవారం మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గన్ని బ్యాగులు సిద్ధం చేసుకోవాలని, బ్యాంకు గ్యారంటీలు ముందుగానే చేసుకోవాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్ డిటి పిన్నింటి రామారావు పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

మండలంలోని కాసిందొరవలస సచివాలయాన్ని శుక్రవారం ఎంపిడిఒ రవి కుమార్ తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. సిబ్బంది విధుల గురించి ఆరా తీశారు. అనంతరం కాసిందొరవలస, నారాయణప్పవలస గ్రామాల్లో మంచి నీటి క్లోరినేషన్, పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎ.భాస్కరరావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష

ప్రజాశక్తి-రాజాం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో ఎంపిడిఒ శ్రీనివాసరావు సమీక్షించారు. గ్రామాల్లో డెంగీ, మలేరియా, డయేరియా వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని పెదగుడిపాల పాఠశాలను ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలను ఆయన పరీక్షించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. జగ్గయ్యపేట పాఠశాలను ఎంఇఒ-2 బాలభాస్కరరావు తనిఖీ చేశారు.

బదిలీపై వెళ్తున్న జెడ్‌పి సిఇఒకు సన్మానం

ప్రజాశక్తి-విజయనగరం

ఇటీవల బదిలీపై విశాఖపట్నం జిల్లా పరిషత్తు సిఇఒగా వెళ్లిన కె.రాజ్‌కుమార్‌ను, వివిధ హోదాలో పనిచేసిన జిల్లా పరిషత్తు కార్యాలయం సిబ్బందిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. మండల పరిషత్తు అభివృద్ధి అధికారులు, పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం కలిసి ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రస్తుత సిఇఒ వి.సత్యనారాయణ, డిప్యూటీ సిఇఒ ఆర్.వెంకటరమణ, ఎంపిడిఒ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణంరాజు, పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు మురళి, రాంబాబు,సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

గుర్ల : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సైబర్ నేరాలు అరికట్టడంలో యువత పాత్ర.. అనే అంశంపై ఎస్ఐ నారాయణరావు ఆధ్వర్యాన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఆర్.సురేష్ కుమార్, ఎన్ఎస్ఎస్ పిఒలు టి.ప్రసాద్, గంగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యాన వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పరీక్షలను ఎస్ఐ బి.దేవి పర్యవేక్షించారు. జూనియర్ కళాశాల, బక్కునాయుడుపేట పాఠశాలలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు డిబేట్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

కార్యదర్శికి సన్మానం

ప్రజాశక్తి - జామి

మండలంలోని కలగాడ గ్రామ కార్యదర్శిగా పని చేసి, బదిలీపై వెళ్లిన రామచంద్రరావుకు సర్పంచ్ సత్యవతి, నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్యదర్శి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎం.రాధ, టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ స్వామి నాయుడు, ఆర్.శ్రీను, చప్పా రామకృష్ణ పాల్గొన్నారు.